సాక్షి
రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 31 । మార్చి । 2024



పెద్దమ్మతల్లి ఉత్సవాలు షురూ..

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లిలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది(సా॥)	సహర్ సోమ(ఉ॥)
కరీంనగర్	6.27	4.41
పెద్దపల్లి	6.34	4.48
రాజన్న సిరిసిల్ల	6.34	4.49
జగిత్యాల	6.34	4.48

గరిష్ఠం/కనిష్ఠం
39.0/25.0

వాతావరణం

వాతావరణం ఎండగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

ఊరూరా మందుపాతర్లు!

- జిల్లాలో బెల్ట్ షాపుల జోరు
- 24 గంటలు మద్యం విక్రయాలు
- అధికారిక వైన్స్‌లు 48.. అనధికారిక బెల్ట్ షాపులు 1,025
- పల్లె నుంచి పట్టణాల దాకా మద్యం అక్రమ అమ్మకాలు
- మామూళ్ల మత్తులో యంత్రాంగం

సాక్షి ఫోకస్



చంద్రంపేటలోని బెల్టుషాప్‌లో మద్యం తాగుతున్న మందుబాబులు

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 48 వైన్స్‌షాపులకు, మరో ఏడు బార్లకు అనుమతి ఉంది. జిల్లాలో నిత్యం రూ.1.50 కోట్ల మద్యం అమ్మకాలు సాగుతాయి. కాగా సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు జిల్లాలోని అన్ని గ్రామాల్లో 1,025 వరకు బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయి. అనుమతి లేకుండా బెల్ట్‌షాపులు నిర్వహించడం చట్టవిరుద్ధమైనా.. జిల్లాలో లైసెన్స్‌లు ఉన్నట్లుగానే జోరుగా బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. వేములవాడ పుణ్యక్షేత్రంలో బెల్ట్‌షాపుల నిర్వాహకులు మద్యాన్ని డోర్ డెలివరీ చేయడం గమనార్హం. పల్లెల్లోనూ ఈ విధానం ఉంది. ఫోన్ చేస్తే.. కోరిన చోటికి, చెప్పిన ప్రదేశానికి మద్యం బాటిళ్లు.. గ్లాసులు, వాటర్ బాటిళ్లతో వచ్చి ఇస్తున్నారు. బెల్ట్ షాపుల్లో నిత్యం మద్యం సిద్ధంగా ఉంటుంది. గతంలో బెల్ట్‌షాపుల్లో సిట్టింగులు ఉండేవి. దీంతో స్థానికంగా గొడవలు జరుగుతున్నాయని పోలీసులు సిట్టింగ్‌లను కట్టడి చేశారు. కానీ మద్యం అమ్మకాలు మాత్రం జోరుగా సాగుతున్నాయి.

ధరలు పెంచి దోపిడీ

సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతోపాటు జిల్లాలోని అన్ని పల్లెల్లో బెల్ట్‌షాపులు ఉన్నాయి. హోటళ్లు, కిరాణ షాపులు కేంద్రంగా కొనసాగుతున్నాయి. వీటిలో మద్యం ధరలను పెంచి అమ్ముతుంటారు. క్వార్టర్ నుంచి ఫుల్‌బాటిళ్ల వరకు ధరలు ఇష్టానుసారంగా పెంచారు. ప్రతీ బాటిల్‌పై రూ.30 నుంచి రూ.200 వరకు బ్రాండ్‌ను బట్టి ధరలు పెంచి అమ్ముతున్నారు. ఇలా ధరలు పెంచి అమ్మడంతోనే వారికి లాభాలు వస్తుంటాయి. బెల్ట్‌షాపు నిర్వాహకుల వద్ద వైన్స్‌షాపుల నిర్వాహకులు నెలకు రూ.2వేల చొప్పున వసూలు చేసి నెలనెలా స్థానిక పోలీస్‌స్టేషన్లలో ఒక్కో షాపు నుంచి రూ.15వేల నుంచి రూ.20వేల వరకు మామూళ్లు అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే ఎక్సైజ్ అధికారులకు సైతం నెలకు రూ.15వేల చొప్పున షాపు తనిఖీలకు వచ్చిన ప్రతిసారి మామూళ్లు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. మొత్తానికి బెల్ట్‌షాపుల నిర్వహణ మామూళ్ల మత్తులో సాగుతున్నాయి. ఎక్సైజ్ అధికారులు అప్పుడప్పుడు బెల్ట్‌షాపులపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నా.. ప్రభుత్వానికి లిక్కర్ అమ్మకాల ద్వారా ఆదాయం వస్తుందనే సాకుతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో..

జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో బెల్ట్‌షాపులపై పోలీసులు దాడులు చేస్తున్నారు. అక్రమంగా నిల్వ చేసిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంటున్నారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో అక్రమంగా బెల్ట్‌షాపులు సాగుతున్నాయి. పోలీసులు దాడులు చేస్తున్నా.. లిక్కర్ దందా సాగుతుంది. ఊరూరా 'మందు' పాతరలు సవాల్ చేస్తున్నాయి.



ఇది చందుర్తిలోని వైన్స్. ఓ యువకుడు తనకు కావాల్సిన మద్యం బ్రాండ్లను సంచిలో నింపుకుని స్కూటీపై తీసుకెళ్తున్నాడు. ఇదేదో శుభకార్యాలకు.. స్నేహితులతో కలిసి జరుపుకునే విందుకు కాదు. తన ఇంటి వద్ద నిర్వహించే బెల్ట్‌షాపులో అమ్మకాల కోసం. బీర్లను ఇంట్లో ఫ్రిడ్జ్‌లో నిల్వ చేసి అమ్ముతాడు. మద్యం బాటిళ్లను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తాడు.



ఈ ఫొటోలో సిరిసిల్ల పట్టణంలోని ఓ వైన్స్ వద్ద మహిళ మద్యం పెట్టెలను ఆటోలోకి తరలిస్తుంది. వైన్స్ నుంచి బీరు పెట్టెలు, విస్కీ, బ్రాందీ ఇలా తన వద్ద అమ్మకాలు జరిగే అన్ని బ్రాండ్ల పెట్టెలను కొనుగోలు చేసి ఇలా ఆటోలో పెద్ద ఎత్తున మద్యం తరలిస్తోంది. తన బెల్ట్ షాపు వద్ద మద్యం అమ్మేందుకు తగ్గట్టుగా ఆటోలో తీసుకెళ్లి నిల్వ చేసుకుంటున్నారు.



ఇది సిరిసిల్ల పట్టణ శివారులోని రగుడు వద్ద ఉన్న ఓ దాబా హోటల్. ఇక్కడ 24 గంటలు అన్ని బ్రాండ్ల మందు లభిస్తుంది. ఫ్రిడ్జ్ నిండా బీర్లు ఉంచి అమ్ముతున్నారు. మరోవైపు వెజ్, నాన్‌వెజ్ వంటకాలు కూడా అందుబాటులో ఉండడంతో మందుబాబులు దాబా(చిన్న గుడిసె) హోటల్‌లో మందు తాగుతూ విందు చేసుకుంటారు. జిల్లాలో వైన్స్‌లు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం విక్రయాలు సాగిస్తుంటే.. బెల్ట్‌షాపుల నిర్వాహకులు 24 గంటలు అందుబాటులో ఉంటూ అక్రమంగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు.

బెల్ట్‌షాపులను కట్టడి చేస్తాం



జిల్లాలో అనధికారికంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్న బెల్ట్‌షాపులపై దాడులు చేస్తున్నాం. ఎక్కడైనా బెల్ట్‌షాపు నిర్వహిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరుతున్నాం. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఎవరైనా మద్యం నిల్వ చేసి అమ్మితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. బెల్ట్ షాపులను పక్కాగా కట్టడి చేస్తాం.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

న్యూస్‌రీల్

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- జెడ్పీ సీఈవో ఉమారాణి



పీహెచ్‌సీ పనులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో

ముస్తాబాద్(సిరిసిల్ల): పల్లెల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు జెడ్పీ సీఈవో ఉమారాణి పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల పరిషత్‌లో శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం భూగర్భ జలాలు పడిపోయాయని, మిషన్ భగీరథ నీరు రాని గ్రామాల్లో పంచాయతీ నీటి వనరులను ఉపయోగించుకోవాలని సూచించారు. అవసరమైన చోట పైపులైన్లు వేయాలన్నారు. అద్దెకు బోరు బావులు తీసుకొని నీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. పోతుగల్ పీహెచ్‌సీ పనులను పరిశీలించారు. ఎంపీడీవో భాస్కర శర్మ, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో ఆనంద్‌మోహన్, మిషన్ భగీరథ ఏఈ సంతోష్ ఉన్నారు.

ఆలయ భూమి లీజుకు వేలం

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని శ్రీవిశ్వనాథస్వామి ఆలయం భూమిని లీజుకు సీల్డు కమ్ బహిరంగ వేలం వేస్తున్నట్లు ఆలయ ఈవో మారుతిరావు శనివారం ప్రకటనలో తెలిపారు. సర్వేనంబరు 1563లోని 22గుంటల భూమి(ఖాళీస్థలం)ని 2024 జూన్ 3 నుంచి 2027 జూన్ 2 వరకు మూడేళ్ల కోసం లీజుకు వేలం వేస్తున్నామని పేర్కొన్నారు. ఏప్రిల్ 15న ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయం పక్కనే గల శ్రీవిశ్వనాథ ఆలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫారం రూ.200 చెల్లించి రూ.25వేలు ధరావతు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అక్రమ మోటార్లు తొలగించాలి



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మానేరువాగులో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న కరెంట్ మోటార్లు తొలగించాలని కోరుతూ గంభీరావుపేట సెస్ ఆఫీస్ ఎదుట దోసలగూడెం వాసులు శనివారం ధర్నా చేశారు. సెస్ అధికారులు స్పందించి అక్రమ మోటార్లను తొలగించాలని డిమాండ్ చేశారు. రెడ్డిమల్ల రాజనర్సు, రాజకుమార్, దోసల రాజు, శంకర్ పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న మదన్ మోహన్‌రెడ్డి

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని శనివారం బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మదన్ మోహన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలోని స్టోర్‌రూంలు, విద్యార్థులకు అందిస్తున్న వంట వస్తువులను, స్టాక్ రిజిస్టర్, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. రానున్న విద్యాసంవత్సరంలో వసతిగృహాల్లో ఎక్కువ ప్రవేశాలు జరిగేలా వార్డెన్‌లు కృషి చేయాలని సూచించారు.

వడ్డెరులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేత



విప్‌కు వినతిపత్రం ఇస్తున్న వడ్డెర నాయకులు

వేములవాడఅర్బన్: వడ్డెరులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విన్నవించారు. వేములవాడలో కలిసి ఈమేరకు విన్నవించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని.. ఇటీవల 16 కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి వడ్డెర కులాన్ని మర్చిపోవడం జరిగిందన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లపు లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు దండుగుల వంశీకృష్ణ, జిల్లా కార్యదర్శి శివరాత్రి ఐలయ్య, ప్రశాంత్, శంకర్, శివరాత్రి దేవయ్య, రాము తదితరులు ఉన్నారు.

చల్లని సేవలకు సలామ్

సండే స్పెషల్

తడారుతున్న గొంతులకు చల్లని నీరందించి ప్రాణాలు నిలుపుతూ.. నీటి జాడల కోసం వెతుకుతున్న పిచ్చుకల కోసం నీటి తొట్టెలు పెడుతూ.. అలసిపోయిన ప్రయాణికులకు మజ్జిగ ఇచ్చి సత్తువ నింపుతూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు పలువురు దాతలు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా వేసవిలో పలువురు స్వచ్ఛందంగా చలివేంద్రాలు.. మజ్జిగ కేంద్రాలు.. నీటితొట్లు ఏర్పాటు చేసి దాహార్తి తీరుస్తున్నారు. వేసవిలో గుక్కెడు నీరుపోసి ప్రాణాలు నిలుపుతున్న మానవతవాదులపై ఈ వారం సండే స్పెషల్... - 8లో

గురుకులాల తనిఖీ



మైనారిటీ గురుకులంలో కిచెన్ పరిశీలిస్తున్న డీపీవో వీరబుచ్చయ్య

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని పలు గురుకులాలను శనివారం జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. తంగళ్లపల్లి మైనారిటీ గురుకులం, బద్దెనపల్లి బీసీ గురుకులం, నేరెళ్ల సోషల్ వెల్ఫేర్ గురుకులాన్ని తనిఖీ చేసి సౌకర్యాలు పరిశీలించారు. ఎంపీడీవో జోగం రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వేములవాడ టౌన్ సీఐపై వేటు

- ఉత్తర్వులు వెల్లడించిన ఐజీ
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: వేములవాడ టౌన్ సీఐగా పనిచేస్తున్న కరుణాకర్‌పై వేటుపడింది. ఆయనను మల్టీజోన్–1కు బదిలీ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని ఎస్పీ అఖిల్ మహాజన్ ధ్రువీకరించారు. వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల కానిస్టేబుళ్లు, హోంగార్డులపై మూకుమ్మడి వేటుపడిన విషయం తెలిసిందే. పోలీస్‌స్టేషన్ పరిపాలన విధమైన తప్పిదాలు, పలువురి నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు సీఐని బదిలీ చేశామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమేద్దాం..

- ఎస్పీ అఖిల్ మహాజన్
- టీడీఎఫ్ ఆధ్వర్యంలో యాంటి డ్రగ్ క్రికెట్ టోర్నీ



విజేతలు ఏఆర్ పోలీస్ టీమ్‌కు ట్రోఫీ అందజేస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మత్తుతో జీవితాలను చిత్తుచేసే డ్రగ్స్ మహమ్మారిని కలిసికట్టుగా తరిమేద్దామని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఇండియా(టీడీఎఫ్), టీడీఎఫ్ కెనడా సంయుక్తంగా ఏర్పాటు చేసిన యాంటి డ్రగ్స్ క్రికెట్ టోర్నీకి ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్‌లో అంకుషాపూర్ క్రికెట్ టీమ్, ఏఆర్ పోలీస్ టీమ్ పోటీ పడగా.. విన్నర్‌గా ఏఆర్ పోలీస్ టీమ్, రన్నర్‌గా అంకుషాపూర్ టీమ్ నిలిచాయి. విజేతలకు ట్రెయినీ ఎస్పీ రాహుల్ రెడ్డితో కలిసి నగదు ట్రోఫీలను అందజేశారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ ఒక్కసారి డ్రగ్స్‌కు అలవాటుపడితే అందులోనే చిక్కుకుంటారన్నారు. డ్రగ్స్ కోసం నేరాలకు పాల్పడిన వారు సైతం ఉన్నారన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ సమాజం నుంచి దూరం కొట్టాలని కోరారు. 'యాంటి డ్రగ్స్ సోల్జర్' యాప్‌ను పోలీస్ శాఖ విడుదల చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. డ్రగ్స్ తీసుకోబోమని ప్రమాణం చేయడంతోపాటు ఎవరైనా తీసుకుంటే యాప్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని 87126 71111లో తెలపాలని కోరారు. కార్యక్రమంలో టీడీఎఫ్ ఇండియా అధ్యక్షుడు మట్టా రాజేశ్వర్‌రెడ్డి, టీడీఎఫ్ కెనడా ప్రతినిధి విక్రమ్, ట్రెయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి, ఏఎస్పీ చంద్రయ్య, రూరల్ సీఐ సదన్‌కుమార్, ఆర్‌ఐ యాదగిరి, ఎస్సై డి.సుధాకర్, టీడీఎఫ్ యూఎస్‌ఏ ప్రెసిడెంట్ మురళి చింతల్పాని, మెంబర్ శ్రీనివాస్ గిలిపిల్లి, ఇండియా జనరల్ సెక్రటరీ వినీల్, టోర్నీ మేనేజర్లు చందు, చింటు పాల్గొన్నారు.

అర్హులకు పోస్టల్ బ్యాలెట్లు

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, అత్యవసర విధులు నిర్వహించే వారికి పోస్టల్ బ్యాలెట్లు ఇస్తామని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలతో విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్లు అందిస్తామని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణ సమయంలో, అత్యవసర విధులు నిర్వహించే వారికి పోస్టల్ బ్యాలెట్లు జారీ చేస్తామన్నారు. ఏప్రిల్ 23లోపు రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేయాల్సి ఉంటుందని తెలిపారు. 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తామన్నారు. వీరు కూడా ఏప్రిల్ 23లోగా దరఖాస్తు చేయాలని కోరారు. మే 3 నుంచి 6 వరకు మొదటి దశ, మే 8న రెండో దశ ఇంటి వద్ద పోలింగ్ నిర్వహిస్తామన్నారు. అదనపు కలెక్టర్లు పి.గౌతమి, ఎన్.ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఎల్.రమేశ్, రాజేశ్వర్, డీఈవో రమేశ్‌కుమార్, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, ఏఎల్‌వో రఫీ, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, పర్యవేక్షకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.



వైభవోపేతం రాజన్న రథోత్సవం

వేములవాడ: దక్షిణకాశీ వేములవాడ రాజన్న రథోత్సవం శనివారం కనుల పండువగా సాగింది. స్వామి వారి ఉత్సవమూర్తులకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. జంట కోడెలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, ఈవో కృష్ణప్రసాద్, ఏఈవోలు శ్రీనివాస్, జయకుమారి, ప్రతాప నవీన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, డీఈ రఘునందన్, ఏఈ శేఖర్, స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ, పర్యవేక్షకులు తిరుపతిరావు, మహేశ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వీరశైవుల ఖడ్గాలు

ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో హోమాలు నిర్వహించారు. అనంతరం వీరశైవుల ఖడ్గాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





పరీక్షలు ముగిశాయోచ్..

పదోతరగతి పరీక్షలు శనివారం ముగిశాయి. ఇన్నాళ్లు పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులు పరీక్షలు ముగియడంతో కేంద్రాల నుంచి ఉత్సాహంగా బయటకు వచ్చారు. తమ ఫ్రెండ్స్‌కు వీడ్కోలు చెబుతూ ఇంటిబాట పట్టారు. మరికొందరు ఉన్నత చదువులకు ఎక్కడికి వెళ్తారు.. ఏం కోర్సులు తీసుకుంటారు.. అనే చర్చించుకోవడం కనిపించింది. మొత్తానికి స్నేహితులకు బై..బై చెబుతూ ఇంటిబాట పట్టారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల







క్లుప్తంగా

బావిలో దూకిన వృద్ధురాలు

● కాపాడిన దివ్యాంగుడు



బావిలో నుంచి వృద్ధురాలిని తీసుకొస్తున్న యువకుడు



యువకుడు రవి

శంకరపట్నం: ఓ కాలు సరిగా పని చేయకున్నా బావిలో దూకిన వృద్ధురాలిని కాపాడి శభాష్ అనిపించుకున్నాడు ఓ దివ్యాంగుడు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో శనివారం ఓ వృద్ధురాలు వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బావి సమీపంలో నివాసముంటున్న బండారి రవి అనే దివ్యాంగుడు గమనించి కాపాడాడు. వృద్ధురాలు కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసింది. బావిలో దూకిన గడ్డం మల్లీశ్వరి(68)ని కాపాడేందుకు చెట్టు కొమ్మలు పట్టుకొని బావిలో దిగిన రవి నీటమునుగుతున్న మల్లీశ్వరిని రక్షించాడు. బావి వద్ద గుమిగూడిన ప్రజలు తాళ్ల సహాయంతో బావి నుంచి బయటికి తీశారు. వృద్ధురాలికి ఇద్దరు కుమారులున్నారు. వెంటనే 108 వాహనానికి సమాచారమందించి చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

ఆర్మీ సోల్జర్ ఆత్మహత్య



నెల్లి రామకృష్ణ(ఫైల్)

సైదాపూర్: దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న కరీంనగర్ జిల్లాకు చెందిన సైనికుడు నెల్లి రామకృష్ణ(27) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, మృతుని బంధువులు తెలిపిన వివరాలు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గొడిశాలకు చెందిన నెల్లి తిరుపతి–స్వరూప దంపతుల కుమారుడు రామకృష్ణ ఆర్మీలో ఐదేళ్లుగా సైనికుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రెండు నెలల క్రితం స్వగ్రామం వచ్చి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ ఇబ్బందిగా ఉందని తల్లిదండ్రులతో చెప్పినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి డ్యూటీ ముగియగానే గదిలోకి వెళ్లిన రామకృష్ణ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహం స్వగ్రామానికి శనివారం చేరుకుంటుందని అక్కడి అధికారులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. రామకృష్ణ మృతిపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామకృష్ణ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇవ్వాలని భగవంతున్ని కోరారు.

చల్లని సేవలకు సలామ్

- చలివేంద్రాలతో దప్పికతీరుస్తున్న దాతలు
- పక్షులకు నీళ్లు పెడుతున్న ప్రేమికులు
- ఏళ్లుగా సమాజసేవతో సంతృప్తి
- ఆదర్శం చిరువ్యాపారుల సేవాస్ఫూర్తి

సండే స్పెషల్

మండే వేసవిలో తడారుతున్న గొంతులకు తాగునీరు అందించే వారు కొందరు. నీటి జాడ కనిపించని పక్షుల కోసం దాబాలపై నీటితొట్టీలు పెట్టేవారు మరికొందరు. తాహతమకు మించినప్పటికీ కూలీలు.. బాటసారుల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు ఇంకొందరు. అందరి ఉద్దేశం సమాజసేవే.. నిండు వేసవిలో గుక్కెడు నీటి కోసం తండ్లాటే మనుషులకు గ్లాసు నీళ్లందించి ప్రాణాలు నిలుపుతున్నారు. భానుడి ప్రతాపానికి విలవిల్లాడే పక్షులకు నీటి తొట్టీలు పెట్టి వాటి మనుగడకు సాయం చేస్తున్నారు. ఇలా.. నిండు వేసవిలో చల్లటి నీటితో ఆప్యాయతలు పంచుతున్న దాతలపై ప్రత్యేక కథనం...

పక్షుల కోసం వాటర్‌ఫౌంటేన్



వాటర్‌ఫౌంటేన్‌తో ఆసిఫ్ దంపతులు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని సింగరేణి సంస్థ ఓసీపీ–2లో సేఫ్టీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ ఆసిఫ్, ఆయన భార్య ఫర్వీన్‌కు పక్షులు, జంతువులు ఉంటే ప్రేమ. స్థానిక విఠల్‌నగర్‌లో ఉంటున్నారు. వేసవిలో పక్షుల దాహార్తి తీర్చేందుకు గత ఎనిమిదేళ్లుగా వారి ఇంటి ఆవరణలో తొలత మట్టి తొట్లు ఏర్పాటు చేశారు. అయితే తొట్టిల్లోని నీరు వేడి అవుతుండడంతో వాటర్‌ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. ఒక డ్రమ్ములో చల్లటి నీటిని పోసి, అందులో కూలర్ మోటార్‌ను పెట్టి.. వాటర్ ఫౌంటేన్‌గా తయారు చేశారు. దీన్ని వారి ఇంటిలోని చెట్ల కింద పెట్టి ఫౌంటేన్‌లా నీళ్లు పైకి చిమ్మేలా ఏర్పాట్లు చేశారు. ఇలా పైకి చిమ్మే నీటిలో పక్షులు ఎంచక్కా ఆడుతూ.. చల్లని నీటిని తాగుతున్నాయి. అంతేకాకుండా పక్షుల కోసం ప్రత్యేకమైన ఆహారం తీసుకొచ్చి చెట్లకింద చల్లుతుంటారు.

15 ఏళ్లుగా దాహం తీరుస్తూ..



రాచర్లగొల్లపల్లిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న లయన్ సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండు వేసవిలో వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికులు, ప్రజల దాహార్తిని తీర్చాలనే లక్ష్యంతో 15 ఏళ్ల క్రితం 12 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు కలిసి మైత్రి పరివార్ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. చలివేంద్రాలు ఏర్పాటు చేసి దాహార్తి తీర్చుతున్నారు. 'నీళ్ల దానం మహాదానం' అనే నానుడిని అనుసరించి ఏటా ఎల్లారెడ్డిపేట మండలకేంద్రం, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మైత్రి పరివార్ అనంతరం అదే సంస్థలోని సభ్యులు లయన్స్ క్లబ్‌గా ఏర్పడి ఆ సేవలను కొనసాగిస్తున్నారు. లయన్ కోట సతీశ్ సహకారంతో ప్రతీ ఏడాది మార్చి 15 నుంచి జూన్ 10 వరకు రూ.50వేలు ఖర్చుచేసి తాగు నీటితోపాటు మజ్జిగను అందిస్తున్నారు.

సామాజిక సేవతో సంతృప్తి



సామాజిక సేవలో సంతృప్తి ఉంటుంది. వేసవిలో ప్రజలకు తాగు నీటిని అందించాలనే సంకల్పంతో 12 మంది ఉపాధ్యాయులం కలిసి మైత్రి పరివార్‌ను ఏర్పాటు చేశాం. గత 15 ఏళ్లుగా రెండు చలివేంద్రాలను ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని ప్రతీ వేసవిలో నిరంతరం కొనసాగిస్తాం.

– ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్ సభ్యుడు, ఎల్లారెడ్డిపేట

పక్షుల సేవలో కుటుంబం



నీటితొట్టీలతో చంద్రశేఖర్ కుటుంబం

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని కాకతీయనగర్‌కు చెందిన బోర్ల చంద్రశేఖర్–పావని దంపతులు పక్షి ప్రేమికులు. చంద్రశేఖర్ ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. తమ ఇంట్లోని ఏసీ కంప్రెషర్ల నుంచి కారే నీటిని పక్షుల తాగడాన్ని చూసి చంద్రశేఖర్ చలించిపోయాడు. వెంటనే పక్షుల కోసం తమ దాబాపై ప్రత్యేకంగా నీటితొట్లు ఏర్పాటు చేశారు. గత నాలుగేళ్లుగా ఏటా వేసవిలో తమ దాబాపై, వరండాలో తల్లి శ్రీలతతో కలిసి చంద్రశేఖర్ దంపతులు మట్టితొట్లలో నీళ్లు పెడుతున్నారు. వాటి ఆకలి తీర్చేందుకు మరో తొట్టిలో గింజలు పోస్తున్నారు.

స్నేహితుడి కోరిక మేరకు..



ప్రగతినగర్‌లో చలివేంద్రం ప్రారంభిస్తున్న నిర్వాహకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్‌కు చెందిన సయ్యద్ ఖాలిద్ స్థానిక చౌరస్తాలో పదేళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. పదేళ్ల క్రితం ఖాలిద్ గల్ఫ్‌లో ఉన్న సమయంలో స్థానికంగా తాగునీటి గోస ఉండేది. ఆ రోజుల్లో తన మిత్రుడు, స్థానిక న్యాయవాది ఉప్పు రాజు కోరిక మేరకు ప్రగతినగర్ చౌరస్తాలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఏటా వేసవిలో ప్రయాణికుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే ఎండలు ముదరడంతో ప్రస్తుతం ఇక్కడే ఉంటున్న సయ్యద్ ఖాలిద్ త్వరలోనే చలివేంద్రం ఏర్పాటు చేస్తానని తెలిపారు.

బాటసారుల సేవలో..



చలివేంద్రంలో సత్యసాయి సేవాసమితి సభ్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో పదహారేళ్లుగా సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఏటా వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు జెండా ప్రాంతంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. వివిధ పనుల కోసం జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు, ప్రయాణికులు, కూలీల సేవలో తరిస్తున్నారు. దినసరి కూలీలకు ఎండ నుంచి రక్షణకు టోపీలు అందిస్తున్నారు.

ఆదర్శం కూరగాయల వ్యాపారి



జూలపల్లిలో చలివేంద్రం

పెద్దపల్లిరూరల్: స్థానికంగా ఉండే మైనార్టీ నిరుపేద యువకుడు ఆతిక్ పాషా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అభిమాని. కూరగాయలు విక్రయించే ఆతిక్‌పాషా ఏటా వేసవిలో దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారకార్థం స్థానిక మండోట వద్ద చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నాడు. ఎవరి నుంచి రూపాయి ఆశించకుండా కూరగాయలు విక్రయిస్తే వచ్చిన లాభాల నుంచే కొంత మొత్తం సేవకు వెచ్చిస్తున్నాడు.

పక్షి ప్రేమికుడు



పక్షుల కోసం నీటిని, గింజలను ఏర్పాటు చేసిన అనంతుల రమేశ్

విద్యానగర్ : కరీంనగర్ కిసాన్ నగర్‌కు చెందిన అనంతుల రమేశ్ పక్షి ప్రేమికుడు. తండ్రి రైతు కావడంతో ఆయన పక్షుల కోసం ఇంటి చుట్టూ వాసాలు, గుంజలకు వరి గొలుసులు వేలాడదీసేవాడు. మట్టి పాత్రల్లో నీళ్లు ఉంచేవాడు. దీంతో ఇంటి పరిసరాలు పిచ్చుకల కిచకిచ రావాలతో సందడిగా ఉండేది. తండ్రి వారసత్వాన్ని రమేశ్ కొనసాగిస్తున్నాడు. పదేళ్లుగా ఇంటిచుట్టూ పల్లె వాతావరణం ఏర్పాటు చేసి పిచ్చుకల కోసం వరి గింజలు, నీటి కోసం ప్రత్యేక పాత్రలు ఏర్పాటు చేసాడు. దీంతో ఆయన ఇంటి చుట్టూ పగలు, రాత్రి తేడాలేకుండా సందడి చేస్తుంటాయి.

జంతు స్నేహితుడు



కుక్కకు బిస్కెట్లు వేస్తున్న సుబ్బారావు

బోయినపల్లి: సైకిల్‌పై వస్తున్న ఆయనను చూడగానే కుక్కలు తోకాడించుకుంటూ వస్తాయి. కవర్‌లో బిస్కెట్లు తీసేవరకు ఎదిరి చూస్తాయి. బిస్కెట్లు వేయగానే ఆనందంగా తింటాయి. పక్కవాడు ఆకలితో గోస పడుతున్న పట్టించుకోని ఈ రోజుల్లో బోయినపల్లిలో సుబ్బారావు కుక్కలకు తన చేను పరిసరాల్లో ఉదయం ఆహారంగా బిస్కెట్లు ఇస్తున్నాడు. 15 ఏళ్ల క్రితం ఆంధ్రా నుంచి వచ్చిన ఈయన బోయినపల్లిలో భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తాడు. నాలుగేళ్ల క్రితం కోవిడ్ సమయంలో ఆహారం దొరకక అల్లాడిన కుక్కలను చూసి చలించిపోయినట్లు చెప్పారు.

సమాజసేవలో చిరువ్యాపారులు

జగిత్యాలటౌన్: వారంతా చిరువ్యాపారులే. రూపాయి.. రూపాయి జమచేస్తేనే వారి కుటుంబాలను వెల్లదీసుకోగలరు. కానీ తమ వంతుగా వేసవిలో కస్టమర్లు, ప్రయాణికుల దాహార్తి తీర్చాలనే కోరికతో మినీచలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. గత కొన్నాళ్లుగా తమ తాహతుకు మించినప్పటికీ ప్రయాణికులు, వినియోగదారుల దాహార్తి తీర్చడంలోనే తమకు తృప్తి ఉందంటున్నారు.

15 ఏళ్లుగా..



మంచి చేయాలనే సంకల్పంతోనే నా పండ్ల బండి వద్ద చల్లని నీటి డబ్బాను పెడుతున్నాను. గత 15 ఏళ్లుగా ప్రయాణికుల దాహార్తి తీర్చుతున్నాను. రోజుకు ఐదు నుంచి ఆరు డబ్బాల నీటిని అందిస్తున్నాను. నాకెంతో సంతృప్తినిస్తుంది.

– అబ్దుల్ బాసిద్ పండ్ల వ్యాపారి. జగిత్యాల

కస్టమర్ల కోసం..



నాకు ఉపాధి కల్పిస్తున్న కస్టమర్ల కోసం నీటి డబ్బాను ఏర్పాటు చేస్తున్న. గత పదేళ్లుగా మినీ చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. ఎండలో వచ్చే వారి దాహం తీర్చడం ఎంతో సంతృప్తినిస్తుంది.

– చేని నాగరాజు, తాళం చెవుల తయారీ, విక్రయదారు

మానవ సేవే.. మాధవ సేవ



మనుషులకు సేవ చేస్తే భగవంతునికి చేసినట్లే. అందుకే కొన్నేళ్లుగా జగిత్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఏటా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. సత్యసాయిబాబా సందేశం స్ఫూర్తితోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

– బట్టు రాజేందర్ సత్యసాయి సేవాసమితి కన్వీనర్ జగిత్యాల

పక్షుల దాహార్తి తీర్చండి



డబ్బాలో నీళ్లు పోస్తున్న పంచాయతీ సిబ్బంది

కరీంనగర్‌రూరల్: ఎండలు మండుతున్నాయి. వచ్చే రెండు నెలల్లో తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ముందస్తుగా స్పందించిన కరీంనగర్ కలెక్టర్ పమేల సత్పతి.. పశువులు, పక్షుల కోసం పల్లెప్రకృతి వనాల్లో నీళ్లు, దాణా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పక్షులు, పశువులకు తాగు నీటి సౌకర్యం కల్పనకు చర్యలు తీసుకున్నారు. ప్లాస్టిక్ డబ్బాలు చెట్లకు ఏర్పాటు చేశారు. పక్షుల ఆహారం కోసం ధాన్యం, మొక్కజొన్న, బియ్యం అందుబాటులో ఉంచారు. పశువుల దాహార్తి తీర్చడం కోసం నీటితొట్టిలు అందుబాటులోకి తెచ్చారు. వేసవికాలం పూర్తయ్యే వరకూ ఈ ప్రక్రియ కొనసాగాలని డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలను కలెక్టర్ ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉచిత శిక్షణ అందేనా?

- ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఏర్పాట్లు పూర్తి
- ఇప్పటికే వంద మంది ఎంపిక
- ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారనుందా?
- ప్రారంభిస్తే యువతకు మేలు

సిరిసిల్లకల్చరల్: సర్కార్ కొలువు సాధించాలనే నిరుద్యోగుల కలను సాకారం చేసుకునేందుకు శిక్షణ ఎంతో అవసరం. నిరుపేద నిరుద్యోగుల కోసం జిల్లాకు మంజూరైన ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ తరగతుల ప్రారంభంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికే ఆసక్తి, అర్హత గల వంద మంది శిక్షణార్థులను ఎంపిక చేశారు. కానీ ఎన్నికల కోడ్ అమలుతో ప్రారంభోత్సవంపై అనుమానాలు కలుగుతున్నాయి. మరో వైపు జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నిధుల కేటాయింపు

రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో రెండేళ్ల క్రితం బీసీ స్టడీ సర్కిల్ ప్రారంభమైంది. తాజాగా గత ఫిబ్రవరి 23న ఎస్సీ స్టడీ సర్కిల్‌ను మంజూరు చేసింది. నిర్వహణ, జీత భత్యాల కోసం రూ.1.15 కోట్లు కేటాయించింది. సిరిసిల్ల నుంచి చంద్రంపేటకు వెళ్లే దారిలో సిరి మండి



స్టడీ సర్కిల్ భవనం

బిర్యానీ పాయింట్‌కు ఎదురుగా ఉన్న ఓ మూడు అంతస్తుల ప్రైవేట్ భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. ఇటీవల కలెక్టర్ అనురాగ్ జయంతి భవనాన్ని పరిశీలించారు.

రేపటి నుంచి తరగతులు ?

మార్చి 18న ప్రారంభించాల్సిన ఎస్సీ స్టడీ సర్కిల్ పలు కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ప్రభావంతో కోడ్ అమల్లోకి రావడంతో ప్రారంభించే అవకాశం లేదు. అయితే నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లకుండా నేరుగా తరగతులను ఏప్రిల్ 1 నుంచి ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. డైరెక్టర్ స్థానంలో తాత్కాలికంగా అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ విజయలక్ష్మికి అదనపు బాధ్యతలు అప్పగించారు. మిగిలిన సేవల కోసం అదే శాఖలో పలువురికి డిప్యూటేషన్ ఇవ్వనున్నట్లు సమాచారం. శిక్షణ పొందే 100 మందికి ఉచిత వసతి, భోజనం, రూ.2500 విలువైన స్టడీ మెటీరియల్ అందజేస్తారు.

త్వరలోనే పోస్టుల భర్తీ



స్టడీ సర్కిల్ నిర్వహణకు డైరెక్టర్ పోస్టు కోసం గడువు ముగిసే నాటికి సుమారు 30 మంది దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ దరఖాస్తులను పరిశీలిస్తోంది. ఉన్నతాధికారుల మార్గదర్శకాలు అనుసరించి కోర్సు కోఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీస్ అసిస్టెంట్స్, వాచ్‌మెన్ పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తాం. తాత్కాలికంగా అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించాం.

– వినోద్‌కుమార్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి

14 మంది మహిళల బైండోవర్

వేములవాడ: వేములవాడలోని మహాలక్ష్మి వీధిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో కొన్ని గృహాలపై డీఎస్పీ నాగేంద్రచారి, శిశు సంక్షేమశాఖ అధికారులతో కలసి శనివారం దాడులు చేశారు. వ్యభిచార వృత్తిని కొనసాగిస్తున్న 14 మంది మహిళలను ఠాణాకు తీసుకొచ్చారు. అక్కడే వారికి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

సఖీ సెంటర్‌కు యువతులు

వేములవాడ: వేములవాడ పట్టణ శివారులోని మహాలక్ష్మి వీధి ప్రాంతంలో వ్యభిచార గృహాలపై ఎస్సై అంజయ్య ఆధ్వర్యంలో శనివారం దాడులు చేసి నలుగురు యువతులను సఖీ సెంటర్‌కు తరలించినట్లు డీఎస్పీ నాగేంద్రచారి శనివారం తెలిపారు. మాయమాటలు చెప్పి యువతులను ఇలాంటి వ్యభిచార కూపంలోకి దింపుతున్నారని, ఆడపిల్లల తల్లిదండ్రులు, యువకులు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలాంటి వ్యవహారంలో యువతరం అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉందన్నారు.


ఐటీ నోటీస్‌లపై నిరసన



సిరిసిల్ల: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీకి ఐటీ నోటీసులు జారీ చేయడంపై ఆ పార్టీ శ్రేణులు సిరిసిల్లలో శనివారం నిరసన తెలిపాయి. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేశారు. ఐటీ నోటీసులు జారీ చేయడాన్ని ఖండించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. నాగుల సత్యనారాయణగౌడ్, చొప్పదండి ప్రకాశ్, సంగీతం శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు, వైద్య శివప్రసాద్, గడ్డం నర్సయ్య, కాముని వనిత, చొప్పదండి లత, సూర దేవరాజు, పిస్క మధు, మ్యాన ప్రసాద్, నీలి రవీందర్, కల్లూరి చందన, గోనె శరణ్య పాల్గొన్నారు.

'స్వీప్'తో ఓటర్లను చైతన్యపరచాలి

● అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్



ఖీమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాలో స్వీప్ కార్యక్రమాలతో ఓటర్లను చైతన్య పరచాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ కోరారు. కలెక్టరేట్‌లో శనివారం స్వీప్ కోర్ కమిటీ సభ్యులతో సమీక్షించారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా ప్రాధాన్యతను వివరిస్తూ స్వీప్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 4,70,438 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరందరిని ఓటు వేసేలా చైతన్య పరచాలని కోరారు. డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 77.71 శాతం పోలింగ్ నమోదైందన్నారు. వేములవాడ పరిధిలోని 13 పోలింగ్ కేంద్రాల్లో, సిరిసిల్ల పరిధిలోని 38 పోలింగ్ కేంద్రాల్లో రాష్ట్ర స్థాయి సగటు పోలింగ్‌శాతం కంటే తక్కువగా నమోదైందని తెలిపారు. వీటిని గుర్తించి అధికారులు స్వీప్ బృందాలతో ఓటింగ్ శాతం పెంచేలా చూడాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులు ఓటువేసేలా చూడాలని, 85 ఏళ్ల దాటిన వారికి ఇంటి వద్ద నుంచి ఓటు వేసే వెసులుబాటును కల్పించాలని వివరించారు. స్వీప్ కోర్ కమిటీ సభ్యులు జిల్లా నోడల్ అధికారి శ్రీనివాస్, డీపీవో వీరబుచ్చయ్య, డీఈవో రమేశ్‌కుమార్, డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు, జిల్లా క్రీడల అధికారి రాందాస్, ఎన్ఎస్ఎస్ వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, డీడబ్ల్యూవో పి.లక్ష్మీరాజం, ఈడీఎం శ్రీనివాస్, డీపీఆర్వో శ్రీధర్, ప్రసార భారతి ప్రతినిధి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.